

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

వివక్షకు వ్యతిరేకంగా..
కనకదాస పోరాటం



- కురుబలలో ఆయన జన్మించడం గర్వకారణం
- కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో స్వర్ణయుగం ఆరంభం
- కురుబలకు సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యం
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- ఘనంగా భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు భక్త కనకదాస అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం నిర్వహించిన కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలలో ఆమె ప్రసంగించారు. ముందుగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కురుబలు ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి గుత్తి రోడ్డులోని భక్త కనకదాస విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. కనకసదా విగ్రహానికి మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి వేడుకలను మంత్రి ప్రారంభించారు. కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీల అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కంకణం కట్టుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రంలో స్వర్ణయుగం మొదలైందని అన్నారు. బీసీలను గుర్తించి, వారు అన్ని రంగాల్లో ముందుండాలని కోరుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం అని అన్నారు. జిల్లాలో రెండు

(తరువాయి 6లో..)



సభకు హాజరైన కురుబ సంఘాల నాయకులు, కురుబ సామాజికవర్గీయులు

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు

- ఎస్పీ జగదీష్



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టం)కార్యక్రమంలో ఎస్పీ జగదీష్ ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 68 అందాయి. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. కొన్ని సమస్యలకు పోలీస్ అధికారులకు ఫోన్ చేసి సంబంధిత ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు-2025 ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 26 వరకూ పొడిగించినట్టు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 26 వరకూ, రూ. 50 అపరాధ రుసుంతో ఈ నెల 27 నుంచి డిసెంబరు 2 వరకూ, రూ. 200 అపరాధ రుసుంతో డిసెంబరు 3 నుంచి 9 వరకూ, రూ. 500 అపరాధ రుసుంతో డిసెంబరు 10 నుంచి 16 తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చునన్నారు. నామినల్ రోల్స్ సైతం ఆన్‌లైన్‌లో నిర్ణీత తేదీల్లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

అంతా హైడ్రామా..!

- ఆర్ఎంఓ పోస్టుపై నాటకీయ పరిణామాలు
- వద్దంటూ పద్మజ లేఖ.. హేమలతకు అవకాశం

అనంతపురంటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో సూపరింటెండెంట్ తర్వాత అత్యంత కీలకమైన పోస్టు ఆర్ఎంఓ. ఇక్కడ ఆ పోస్టులో పని చేయాలంటే ఎవరికైనా కత్తిమీద సామే. అందుకే ఎవరూ ఇక్కడ రెగ్యులర్ ఆర్ఎంఓలు ఉండకుండా వెళ్లిపోతున్నారు. రెండేళ్ల కిందట ఇక్కడ రెగ్యులర్ ఆర్ఎంఓగా పని చేసిన లలిత ఉద్యోగవిరమణ పొందారు. ఆతర్వాత చిత్తూరు జిల్లా నుంచి డాక్టరు సరస్వతిని ఇక్కడకు ఆర్ఎంఓగా నియమించా రు. ఆమె బాధ్యతలు తీసుకొన్న నెలరోజులకే ఇక్కడ నుంచి వెళ్లిపోయారు. అప్పటినుంచి ఈఆస్పత్రిలో రెగ్యులర్ ఆర్ఎంఓలేరు. దీంతో డిప్యూటీ ఆర్ఎంఓలే ఇంచార్జులుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. నిన్నటివరకు డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు పద్మజ ఇన్‌చార్జ్ ఆర్ఎంఓగా బాధ్యతలు నిర్వర్తించేవారు. అయితే ఇక్కడ డిప్యూటీ ఆర్ఎంఓల మధ్య ఆధిపత్యపోరు సాగుతోంది. అందులో భాగంగా ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ బిల్లులపై సంతకాల విషయంలో రెండురకాలుగా వ్యవహరించడంతో వివాదం తలెత్తినట్లు తెలిసింది. ఆవిషయంలో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగగా పద్మజ సెలవులో వెళ్లిపోయారు. ఆమె ఇక మళ్లీ విధులకు రారని చర్చసాగింది. ఇదే సందర్భంలోనే తనకు ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ బాధ్యతలు వద్దని ఆమె ఓ లేఖ రాసి సూపరింటెండెంట్‌కు ఇచ్చారు. దీంతో ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ పోస్టుకు మరో ఇద్దరు డాక్టర్లు పోటీపడినట్లు ప్రచారం సాగింది. చివరకు డాక్టరు హేమలతకు ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ బాధ్యతలు అప్పగిస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉత్తర్వులు ఇచ్చారు. అయినా ఈవిషయం కనీసం మీడియాకు కూడా చెప్పకుండా గుట్టుగా ఉంచడంలో మతలబు ఏంటో అర్థం కావడంలేదు.



ఇన్‌చార్జ్ ఆర్ఎంఓగా హేమలతను నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు

సీమకు జగన్ అన్యాయం

- వెంకటశివుడు యాదవ్



సమావేశంలో ఆలం, వెంకటశివుడు, గౌస్

అనంతపురం అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీమకు అన్యాయం చేసింది జగన్‌రెడ్డేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్‌లతో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మండిపడ్డారు. ఈ జిల్లా మనవడినని, హంద్రీనీవాకు సమాంతర కాలువ తవ్వి 10వేల క్యూసెక్కులకు నీటి సామర్థ్యాన్ని పెంచుతామని మీ నాయకుడు జగన్‌రెడ్డి హామీ ఇచ్చి, నెరవేర్చకుండా పోయిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఐదేళ్ల కాలంలో హంద్రీనీవాకు ఒక్క రూపాయి కేటాయించి, ఖర్చు పెట్టారా అని నిలదీశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలోనే రాయలసీమలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. జిల్లాకు కియ కార్ల ఫ్యాక్టరీని తీసుకొచ్చి ప్రత్యక్షంగా 10వేల మందికి, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కర్నూలులోనే ఉంచుతామని, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి టీజీ భరత్ ప్రకటించారన్నారు. రాయలసీమకు సాగు, తాగు నీరు అందించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని శాసనమండలిలో మంత్రి నిమ్మల రామానాయు డు చెప్పారని గుర్తు చేశారు. ఐదేళ్ల మీ జగన్‌రెడ్డి పాలన విధ్వంసకరంగా ఉన్నందునే ప్రజలు మీకు ఓటుతో గుణపాఠం చెప్పారన్నారు. గత ఐదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న నీవు ఏనాడైనా జిల్లాకు అభివృద్ధి పనులు కావాలని జగన్‌రెడ్డిని అడిగావా అని ప్రశ్నించారు.

ఘనమైన వారసత్వాన్ని కాపాడుకోవాలి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరూ చారిత్రక స్పృహను పెంచుకుని, మన ఘనమైన వారసత్వాన్ని కాపాడుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2024ను పురస్కరించుకుని పురావస్తు ప్రదర్శనశాలల శాఖ, జిల్లా పర్యాటక శాఖ, ఇంటాక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. దీనిన కోర్టు రోడ్డులోని పీస్ మెమోరియల్ హాల్ నుంచి ఆదిమూర్తినగర్‌లోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శన శాల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీతోపాటు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రాచీన వారసత్వాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. వందేళ్ల క్రితం నాటి పీస్ మెమోరియల్ హాల్ ఇప్పటికీ చెక్కు చెదరలేదని, ఇలాంటి ప్రాచీన వారసత్వ సంపద జిల్లాలో ఎన్నో ఉన్నాయన్నారు. వీటి గురించి యువత, విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం ఒక్కో పాఠశాల నుంచి విద్యార్థులు వచ్చి వీటిని సందర్శించాలన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు పాలించిన ప్రాంతం గా, కళలు, కళాకారులకు నిలయంగా అనంతపురం జిల్లా గొప్ప స్థానంలో ఉందన్నారు. గుత్తికోట, లేపాక్షి, తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వరాలయం, పుట్టపర్తి ఇలా ఎన్నో గొప్ప చారిత్రాత్మక ప్రదేశాలున్నాయన్నారు.

వీలు కుదిరినప్పుడల్లా తల్లిదండ్రులు తమ పిల్లలను ఇలాంటి ప్రదేశాలకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా పురావస్తు శాఖ ఏడీ రజిత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖాధికారి జయకుమార్‌బాబు, ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, కవి కంబదూరి షేక్ నబీరసూల్, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, ఆర్ట్స్ కళాశాల, ఎస్పీఎస్ డిగ్రీ కళాశాల, ఎస్ఎస్ఎస్ జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

రాత్రి వైద్యంపై శ్రద్ధ..!

- సీహెచ్‌సీల్లో డాక్టర్లు ఉండేలా చర్యలు
- రాత్రిపూటా వైద్యులకు ముఖ హాజరు
- డుమ్మా డాక్టర్ల కట్టడికి ప్రయత్నాలు

సీహెచ్‌సీల్లో రోగులకు రాత్రిపూట సక్రమంగా వైద్య సేవలు అందేలా వైద్య శాఖ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. సీహెచ్‌సీల్లో 24గంటలు రోగులకు చికిత్సలు అందించాల్సి ఉంటుంది. కానీ అక్కడ పనిచేసే డాక్టర్లు నిబంధనల మేరకు విధులు నిర్వహించడం లేదన్న ఆరోపణలు ముందు నుంచి ఉన్నాయి. ఈనేపథ్యంలో సీహెచ్‌సీల లో పనిచేసే డాక్టర్లకు పగటిపూట తప్పకుండా ముఖహాజరు నిబంధనలు తీసుకువచ్చారు. అయితే చాలామంది డాక్టర్లు రాత్రిపూట విధుల్లో ఉండటంలేదని, రాత్రి పూట వచ్చిన రోగులు వైద్యులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో డీసీహెచ్ కమిషనర్ ఐఏఎస్ శిరి రాత్రిడ్యూటీ డాక్టర్లు డుమ్మా కొట్టకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. ఇందుకోసం రాత్రిపూట వారిపై నిఘాపెంచారు. ఇకనుంచి రాత్రి పూటకూడా విధులలో ఉన్న డాక్టర్లు తప్పనిసరిగా ఫొటోలు తీసి వాట్సాప్‌గ్రూపులో పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్



డుమ్మా డాక్టర్లకు ముకుతాడు

జిల్లా వైద్యవిధానపరిషత్ పరిధిలో 11ఆస్పత్రులు ఉన్నాయి. ఇందులో కళ్యాణదుర్గం, గుత్తి, శింగనమల, పామిడి, కొనకొండ్ల, ఉరవకొండ, కణేకల్లులో సీహెచ్‌సీలు ఉన్నాయి. తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం నియోజవర్గకేంద్రాలలో ఏరియా ఆస్పత్రులు ఉండగా జిల్లా కేంద్రంలోని పాతూరులో సీడీ ఆస్పత్రి ఉంది. ఈఆస్పత్రులన్నీ 24గంటలు అందుబాటులో ఉండి రోగులకు అత్యవసరసేవలు కూడా అందించాల్సి ఉంటుంది. ఇక్కడ పనిచేసే చాలా మంది డాక్టర్లు అందరూ ప్రతిరోజు ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ ఆడాక్టర్లు ఆస్పత్రులకు సక్రమంగా రాకుండా ఇష్టారాజ్యంగా వస్తూపోతూ రోగులను పట్టించుకోవడం లేదని, సొంత ఆస్పత్రులకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం, శింగనమల, పామిడి ఆస్పత్రులలో పనిచేసే డాక్టర్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రాష్ట్రశాఖాధికారులు ఉదయం 9గంటలకు, సాయంత్రం 4గంటలకు ముఖహాజరు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనల తీసుకొచ్చారు. రాత్రిపూట ఒక డాక్టర్ తప్పనిసరిగా మరుసటిరోజు ఉదయం వరకు డ్యూటీలో ఉండాల్సి ఉంటుంది. అయితే చాలామంది డాక్టర్లు రాత్రిడ్యూటీలో ఉండటంలేదని, దీంతో రోగులకు ఉన్న సిబ్బంది అరకొర వైద్యం అందిస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు చిన్నకేసులను కూడా సిబ్బంది డాక్టర్లు లేరనిచెప్పి జిల్లా ఆస్పత్రికి లేదా, ప్రైవేట్ ఆస్పత్రులకు చెప్పి పంపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో డీసీహెచ్ కమిషనర్ శిరి రాత్రి డ్యూటీ డాక్టర్ల డుమ్మాకు ముకుతాడు వేయడానికి కొత్తనిబంధన తీసుకొచ్చారు. రాత్రిడ్యూటీలో ఉన్న ప్రతిడాక్టరు రాత్రి 10గంటలనుంచి 11గంటలలోపు, అలాగే తెల్లవారుజామున 3 గంటలనుంచి 4గంటలలోపు ఆయా ఆస్పత్రులలో చికిత్సపొందుతున్న ఇన్‌పేషెంట్లు వద్ద నిల్చొని ఫొటో తీసి వాట్సాప్‌గ్రూపులో పెట్టాల్సి ఉంటుంది. ఇలా డుమ్మా డాక్టర్లపై ప్రత్యేక నిఘా పెట్టడంతో ఆశాఖ వైద్యులలో తీవ్ర టెన్షన్ నెలకొంది.



రాత్రిడ్యూటీడాక్టరు రోగుల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న దృశ్యం

ఇప్పటికే అమలు చేస్తున్నాం



సీహెచ్‌సీలు 24గంటలు పనిచేయాలి. అక్కడ పనిచేసే డాక్టర్లు, సిబ్బంది నిబంధనల మేరకు విధులు నిర్వర్తించి రోగులకు వైద్యసేవలు అందించాల్సిందే. ఇప్పటివరకు పగలు మాత్రమే ముఖహాజరు తీసుకునేవాళ్లం. ఇకమీదట రాత్రి డ్యూటీడాక్టర్ల హాజరు కూడా తీసుకుంటాం. రాత్రిడ్యూటీలో ఉన్న డాక్టర్లు ప్రతిరోజు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న రోగుల వద్ద నిల్చొని, ఫొటో తీసి వాట్సాప్ గ్రూపులో పెట్టాలి. వాటిని జిల్లా కలెక్టరుతో పాటు, రాష్ట్ర కమిషనరు పరిశీలిస్తారు. ఇప్పటికే జిల్లాలో అమలుచేస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

- డాక్టరు రవికుమార్, డీసీహెచ్ఎస్

న్యూస్ బాక్స్

చట్టాలపై అవగాహన ఉండాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలి గి ఉంటే సమస్యలను పరిష్కరించుకోవడం సులభమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ అన్నారు. సోమవారం న్యాయసేవాసదన్ హాల్‌లో అసంఘటిత కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఏ అధికారి లేదా యజమాని నుంచైనా ఇబ్బందులు ఎదురైతే చట్టపరిధిలో పరిష్కరించుకోవడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చన్నారు. అసంఘటిత కార్మికులకు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు సుజాత, ప్రతాప్‌నాయుడు, న్యాయవాది హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి సోమవారం తెలిపారు. ఇన్‌స్టాలేషన్ ఆఫ్ స్మార్ట్ మీటర్స్ ఉద్యోగాల కోసం 20న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలతో పాటు ఆధార్, పాన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12వేల వేతనం, అదనంగా టీఏ, డీఏ చెల్లిస్తారని తెలిపారు.

పంచాయతీలకు రూ. 35.013 కోట్లు

అనంతపురం న్యూటౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీలకు 2024-25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు తొలివిడతగా రూ.35.013 కోట్లు కేటాయించినట్లు డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. ఇందులో బేసిక్ గ్రాంటుకు సంబంధించి రూ.14 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఇందులో 25 శాతం ఈఈఎస్ఎల్‌కు, 25 శాతం పెండింగ్ విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వినియోగించేలా ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. టైడ్ గ్రాంట్స్‌కు సంబంధించి రూ.21 కోట్లను పారిశుధ్య నిర్వహణ క్లాప్‌మిత్రాలకు వేతన బకాయిలు చెల్లించేలా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారి చేసినట్లు డీపీఓ తెలిపారు.

విస్తృతంగా 'ఉపాధి' కల్పించాలి

అనంతపురంటౌన్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ద్వారా కూలీలకు విస్తృతంగా పనులు కల్పించాలని కలెక్టరు వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఉపాధి పనులపై సమీక్షించారు. జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఏపీడీలు ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టరు మాట్లాడుతూ ఉపాధి పథకం కింద నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచి లేబర్ బడ్జెట్‌లో కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వజ్రకరూరు, కూడేరు మండలాలలో కూలీల సంఖ్య మరింత పెంచాలన్నారు. జిల్లాలో మండలాల వారీగా ఎక్కడెక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో వాటి వివరాలు పక్కాగా పంపాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీసీరోడ్ల నిర్మాణాలు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు పూర్తిచేయాలన్నారు. ప్లాంటేషన్ కూడా వారంలో పూర్తి కావాలన్నారు. మండలాలవారీగా జరుగుతున్న పనుల వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, హార్టికల్చర్ డీడీనరసింహారావు, హౌసింగ్ పీడీ శైలజ, ఏపీడీ శైలజ, ఆర్‌డబ్ల్యుఎస్, పీఆర్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంటైనర్ వాహనం బోల్తా

చెన్నేకొత్తపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఓ కంటైనర్ వాహనం బోల్తా పడింది. తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి ఢిల్లీకి వెళ్తున్న కంటైనర్ చెన్నేకొత్తపల్లి సమీపానికి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఇద్దరు డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారు. ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో ప్రమాదస్థలానికి వెళ్లి రోడ్డుకు అడ్డంగా పడిన వాహనాన్ని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.



జాతీయ రహదారిపై బోల్తాపడిన కంటైనర్



సభలో ప్రసంగిస్తున్న మంత్రి సవిత, వేదికపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, టీడీపీ, సీపీఐ, బీసీ సంఘాల నాయకులు

వివక్షకు వ్యతిరేకంగా..

(5వ పేజీ తరువాయి)

ఎంపీ స్థానాలను బీసీలకు కేటాయించారని అన్నారు. తనకు మంత్రిగా అవకాశం కల్పించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కనకదాస జయంత్యుత్సవాలు నిర్వహించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో వేడుకలకు రూ.12.50 లక్షలు చొప్పున నిధులను ముఖ్యమంత్రి కేటాయించారని అన్నారు. భక్త కనకదాస ఊరూరా తిరుగుతూ తన కీర్తనల చేత ప్రజలను చైతన్యపరిచారని అన్నారు. సంఘటితగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని చాటారని అన్నారు. కనకదాస కురుబ కులంలో జన్మించడం గర్వకారణమని అన్నారు. బీసీలు టీడీపీ పార్టీ బ్యాక్‌బోన్ అని సీఎం చెప్పారని, ప్రతి బీసీ వ్యాపారవేత్త కావాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని సూచించారు. కురుబలు షీప్ ఫామ్ పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారని, వారికి రూ.50 లక్షల వరకూ రుణాలు ప్రతి యూనిట్‌కి ఇస్తామని తెలిపారు. యూనిట్‌కి రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకూ రుణం బీసీ సంక్షేమశాఖ తరుపున ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. అందులో 10 శాతం లబ్ధిదారుని వాటా, 40 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు రుణం వస్తుందని అన్నారు. గతంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు నిధులు లేకుండా ఉత్సవ విగ్రహాలుగా మారయని అన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్లకు రూ.1000 కోట్ల వరకూ నిధులు ఇచ్చామని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక డీఎస్సీని విడుదల చేశామని, అభ్యర్థులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టీటీడీలో బోర్డు మెంబర్‌గా కురుబలకు వచ్చే దశలో అవకాశం ఇస్తామని అన్నారు.



కనకదాస విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్



గొరవయ్యల నృత్య ప్రదర్శన

● సంతోషకరం: కలెక్టర్



భక్త కనకదాస జయంతి రాష్ట్రస్థాయి ఉత్సవాలను జిల్లాలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని అన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని అన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కనకదాస జయంత్యుత్సవాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు, గొరవయ్యల సంప్రదాయ వేషధారణ, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకలను విజయవంతం చేసిన కలెక్టర్‌కు మంత్రి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కురుబ సంఘాల నాయకులు, టీడీపీ, బీసీ సంఘాల నాయకులను మంత్రి, ఎమ్మెల్యేలు ఘనంగా సత్కరించారు. వేడుకలలో బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్, కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, డైరెక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ, ఆర్డీఓ కేశవనాయుడు, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, అనంతపురం తహసీల్దారు హరికుమార్, జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ దక్షిణాది రాష్ట్రాల గౌరవ అధ్యక్షులు బాసినేని వెంగమేష్ చౌదరి, సీపీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, టీడీపీ నాయకులు గంజే నాగరాజు, ఆవుల కృష్ణయ్య, కురబ నారాయణస్వామి, కురబ సంఘాల నాయకులు తుప్పటి ఈశ్వరయ్య, తగరకుంట కృష్ణమూర్తి, ఆంజనేయులు, గంగులకుంట రమణ, శీనయ్య, విఠల్‌గౌడ్, బాలాజీ, మల్లికార్జున, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి: గేయానంద్



మాట్లాడుతున్న గేయానంద్

అనంతపురంటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న ఆశాకార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టరు గేయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవుల జీఓలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయసు 62ఏళ్లకు పెంచాలని, రాజకీయనేతలు, అధికారుల వేధింపులు ఆపాలని, ఖాళీగా ఉన్న ఆశాపోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆశాల ఆందోళనకు గేయానంద్, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్ మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యపరిరక్షణకు ఆశాలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అయినా కనీసవేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో జేసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల్, రామాంజనేయులు, బాలరంగయ్య, ఆశాలు మాలతి, నాగమణి, అక్కమ్మ, భాగ్యమ్మ, హసీన్, అంబికా, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కామిరెడ్డిపల్లికి స్కెచ్..?

● జడ్పీ వైస్ చైర్మన్ ఇంటి ప్రహరీకి కరెంటు

● ఫెన్సింగ్ నుంచి 33 కేవీ లైన్ వరకూ వైర్లు

ధర్మవరం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం కామిరెడ్డిపల్లి గ్రామంలో ఉమ్మడి అనంతపురం జడ్పీ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి ఇంటి ప్రహరీకి, ఆవరణంలో ఉన్న పశువుల దొడ్డికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే ప్రయత్నం చేశారు. తద్వారా ఆ ఇంట్లో ఉండేవారికి ముప్పు తలపెట్టే ప్రయత్నం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి ఇంటి చుట్టూ ఉన్న ఫెన్సింగ్, పశువులదొడ్డి ఫెన్సింగ్ తీగలకు విద్యుత్ వైర్లును అమర్చారు. వాటిని 50 అడుగుల దూరంలో ఉన్న 33 కేవీ విద్యుత్ స్తంభం వరకూ పరిచారు. విద్యుత్ స్తంభానికి ఉన్న ఫైబర్ నెట్ వైర్ వరకు ఈ తీగలను లాగారు. గ్రామానికి చెందిన వీరారెడ్డి సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లుతుండగా కాలికి విద్యుత్ తీగ తగలడంతో అనుమానంతో పరిశీలించాడు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో బెంగుళూరులో ఉన్న కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి.. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు తెలియజేశారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది, ఇంటెలిజెంట్స్ పోలీసులు గ్రామానికి వెళ్లి సుధాకర్‌రెడ్డి ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడ నుంచి విద్యుత్ వైర్ తెచ్చారు, ఎవరు, ఎలా అమర్చారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి సుధాకర్‌రెడ్డి స్వగ్రామానికి చేరుకుఅన్నరు. ప్రతిరోజూ పశువులను దొడ్డిలో కట్టేసేందుకు వెళుతుంటామని, ఆ సమయంలో తనకు ప్రమాదం తలపెట్టాలని చూశారని సుధాకర్ రెడ్డి అన్నారు. ఈ ఘటనపై సుధాకర్‌రెడ్డి సోదరుడు రవీంద్రారెడ్డి ధర్మవరం రూరల్ పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు.



ఫెన్సింగ్‌కు కరెంటు తీగ

మునిసిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సస్పెన్షన్

గుంతకల్లు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కొళాయి కనెక్షన్లను ఇచ్చారన్న కారణంగా మున్సిపల్ ఉద్యోగులు కే ఈరన్న, సోమశేఖర్ రెడ్డిపై గుంతకల్లు మునిసిపల్ కమిషనరు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనరు నయ్యాం అహ్మద్ ఆదివారం సస్పెన్షన్ ఉత్తర్వులిచ్చారు. ఇంజనీరింగ్ శాఖ శాశ్వత ఉద్యోగి ఈరన్న, తాత్కాలిక ఉద్యోగి సోమశేఖర్ రెడ్డి పట్టణంలోని కొనకొండ్ల రైల్వే గేటు వద్ద ఉన్న ఆర్డీటీ కాలనీలో కొందరికి అక్రమంగా కొళాయి కనెక్షన్లను ఇచ్చినట్లు మునిపల్ అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో మునిసిపల్ కమిషనరు విచారణకు ఎంఈని ఆదేశించారు. విచారణలో ఈ ఇద్దరు ఉద్యోగులు ఒక్క ఆదివారమే అక్రమంగా ఐదు కొళాయి కనెక్షన్లను ఇచ్చారని తేలింది. అలాగే కొళాయి అక్రమ కనెక్షన్ల కోసం రోడ్డును కూడా ఎక్స్‌కవేటర్‌తో ఇష్టానుసారంగా తవ్వేసినట్లు విచారణలో తేలిందని కమిషనర్ వెల్లడించారు. అందుకే వారిద్దరిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు పేర్కొన్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి: జేసీ

అనంతపురంటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై వచ్చిన ప్రతి బాధితుడి అర్జీని పరిశీలించి, పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టరు శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్ఓ మలోల ఇతర అధికారులు ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 321మంది తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతులు అందజేసినట్లు జేసీ తెలిపారు. గ్రీవెన్స్ అనంతరం జాయింట్ కలెక్టరు ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రతిఫిర్యాదును బాధ్యతగా తీసుకొని వాటికి పరిష్కారం చూపాలన్నారు. అర్జీ ఇచ్చిన ఫిర్యాదుదారుడితో మాట్లాడి వారు సంతృప్తిపడేలా సమాధానం ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైసీపీ అధికారుల నిర్లక్ష్యంతోనే హత్య

● కృష్ణమూర్తి హత్యోదంతంపై సందిరెడ్డి ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ కార్యకర్త కామిశెట్టి కృష్ణమూర్తి హత్యకు వైసీపీ ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు మండిపడ్డారు. రోడ్లు, భవనాల అతిథిగృహంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణమూర్తి హత్యకు దారితీసిన కారణాలను సందిరెడ్డి వివరించారు. బొమ్మనహాళ్ మండలం చంద్రగిరికి చెందిన కామిశెట్టి కృష్ణమూర్తికి అదే మండలం కురవహళ్లికి చెందిన వైసీపీ కార్యకర్త బోయ శ్రీనివాసులు పొలాన్ని అమ్మారని తెలిపారు. అనంతరం తిరగబడిన శ్రీనివాసులు తరచూ కృష్ణమూర్తితో గొడవలకు దిగేవాడన్నారు. గొడవలెందుకుని భావించిన కృష్ణమూర్తి ఆయనకొన్న పొలంలోనే కొన్ని సెంట్ల భూమిని శ్రీనివాసులకు తిరిగి అప్పగించారని తెలిపారు. అయినా 2021లో కృష్ణమూర్తిపై హత్యా యత్నం చేశారని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని నిందితులపై కేసు నమోదుచేసి న్యాయం చేయాలని మూడు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరిగారన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. చివరికి కృష్ణమూర్తి హతమయ్యాడని పేర్కొన్నారు. హత్యచేసిన బోయ శ్రీనివాసులు, సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నమయ్య, దేవిరెడ్డి లక్ష్మీదేవి, లలిత్‌కుమార్, అశోక్‌రెడ్డి, గోపాల్, సూర్యప్రకాష్, సోమయ్య, ఇలియాజ్, దిలీప్, రాజేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ జగదీష్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సందిరెడ్డి శ్రీనివాసులు

● కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం: అంబికా



సామాన్య కుటుంబంలో జన్మించి, కుల వివక్షకు వ్యతిరేకంగా భక్త కనకదాస పోరాడారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సమాజంలో అందరూ సమానమని, అందరూ మంచి మిత్రులుగా మెలగాలని సూచించారు. కురుబలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. ఇంతకు ముందు ఎవరూ అంతటి ప్రాధాన్యం కల్పించలేదని అన్నారు. కురుబ కనకదాస కళ్యాణ మండపం కోసం ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయిస్తామని అన్నారు.

● మాట నిలబెట్టుకున్న చంద్రబాబు: బీకే



భక్త కనకదాస జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ఎన్నికలకు ముందు చంద్రబాబుని అడిగామని, అందుకు అంగీకరించారని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు అధికారికంగా కనకదాస జయంతిని నిర్వహిస్తున్నారని అన్నారు. కురుబలు 20 సంవత్సరాల నుంచి ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారని అన్నారు. వారికి చదువు, సంస్కారం, పాలనలో భాగస్వామ్యం ఉందని అన్నారు. కనకదాసను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు.

● కురుబలకు అండ: పరిటాల సునీత



పరిటాల కుటుంబం మొదటి నుంచి కురుబలకు అండగా ఉంటోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కష్టకాలంలో కూడా కురుబలు తమ వెన్నంటే నడిచారని అన్నారు. ఒకప్పుడు పార్థసారథిని జడ్పీ చైర్మన్‌ని చేయడంతో పాటు ఎంతో మంది కురుబలకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించిన వ్యక్తి పరిటాల రవి అని గుర్తు చేశారు. ఆ రోజుల్లో రామచంద్రారెడ్డి లాంటి వారిని ఎన్టీఆర్ మంత్రిని చేశారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలకు ప్రాధాన్యమిస్తూ, వారికి అండగా నిలిచారని అన్నారు. కురబలకు ప్రధానమైన వృత్తి గొర్రెల పెంపకమని, ఇటీవల గొర్రెలు వ్యాధుల బారిన పడి చనిపోతుండటంతో వారు నష్టపోతున్నారని అన్నారు. వారిలో అవగాహన పెంచి.. బీమా చేయించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. రాప్తాడు నియోజకవర్గంలో కురుబలకు గొర్రెలు, మేకల యూనిట్లు, రుణాలు ఎక్కువగా ఇవ్వాలని కోరారు.

● కురుబలకు ప్రాధాన్యం: దగ్గుపాటి



ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. పెనుకొండకు ప్రాతినిధ్యం వహించిన సవితమ్మకు మంత్రి పదవి ఇచ్చారని, హిందూపురం ఎంపీగా పార్థసారథికి అవకాశం కల్పించారని అన్నారు. భక్త కనకదాస సామాన్యులకు అర్థమయ్యేలా రచనలు చేశారని అన్నారు. కృష్ణ భక్తుడిగా తన జీవితాన్ని దైవానికి అంకితం చేశారని అన్నారు. సమాజంలో వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కురబలకు ఆరాధ్యదైవంగా ఆయన నిలిచారని కొనియాడారు.

● కురుబల పండుగ: అమిలినేని



కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలు కురుబలకు గొప్ప పండుగ అని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. జిల్లాలో కురుబలు చాలా మంది ఉన్నారని, వారికి చాలా సమస్యలు ఉన్నాయని అన్నారు. కేంద్రంలో కావాల్సినన్ని నిధులు ఉన్నాయని, ఉమ్మడి జిల్లాకు అవసరమైన నిధులను తీసుకురావాలని ఎంపీలను కోరారు. వచ్చే సంవత్సరం నిర్వహించే కనకదాస జయంతికి ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామని అన్నారు. కళ్యాణదుర్గంలో కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. అన్ని రకాలుగా కురుబలకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలి

● ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచాలని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాసులు అన్నా రు. స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1988లో ప్రారంభమైన ప్రాజెక్టు 35 ఏళ్లు గడిచినా పూర్తి కాకపోవడం దారుణమన్నారు. 2012-13లో మొదటి దశలో జీడిపల్లికి హంద్రీనీవా నీళ్లు వచ్చాయన్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత రెండో దశలో కాలువ పనులు పూర్తి చేసి గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు నీరు అందించారన్నారు. మూడేళ్ల కిందట హంద్రీనీవా కాలువలో 9 నెలలు నీరు ప్రవహించిందన్నారు. 40టీఎంసీలు నీరు వచ్చినా ఉమ్మడి జిల్లాలో కేవలం 160 చెరువులను అరకొరగా నింపారన్నారు. జీడిపల్లి నుంచి చిత్తూరు జిల్లా వరకు కాలువ వెడల్పు చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి పిల్లకాలువలు ఏర్పాటు చేసి రాయలసీమలోని 4జిల్లాల్లో 6,02,500ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా కాలువ నిర్మాణానికి పూర్తి స్థాయిలో ప్రత్యేక బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసి రెండు సంవత్సరాలలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2009లో ప్రారంభించిన హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. పీఏబీర్ ప్రాజెక్టులో 11 టీఎంసీలు నీరు నిల్వ ఉండేలా నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ సురేష్, సభ్యులు జిలాన్, సత్తార్, బాషా, నారాయణ, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షలు ఇవ్వాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



పంచాయతీ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న జాఫర్, సీపీఐ నాయకులు

అనంతపురంరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరల దృష్ట్యా పేదల గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఆర్థిక సాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు పేదలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3సెంట్లు ప్రకారం స్థలాలు ఇవ్వాలని మండలంలోని సోములదొడ్డి పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాఫర్‌తో పాటు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున హాజరై మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సాయం ఏమాత్రం సరిపోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని విమర్శించారు. మండలంలోని కందుకూరు, కక్కలపల్లి కాలనీ, కృష్ణంరెడ్డిపల్లి, ఆకుతోటపల్లి, పూలకుంట, అక్కంపల్లి, రుద్రంపేట గ్రామాల్లోని సచివాలయాల్లో కూడా సీపీఐ నాయకులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండలం కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, నగర సహాయ కార్యదర్శి అల్లీపీరా, రామయ్య, వరలక్ష్మి, జిల్లా సమితి సభ్యులు ఈశ్వరయ్య శాంతి పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

భారీ బందోబస్తు



రథోత్సవం వద్ద ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి):: సత్యసాయిబాబా జయంత్యుత్స వాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. వేడుకల తొలిరోజు సోమవారం ఉదయం 9 గంట లకు వేణుగోపాలస్వామి రథోత్సవం ప్రారంభమైంది. డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు సీఐలు, ఎస్‌ఐలు, వందమంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. గోకులం నుంచి సత్యమ్మ గుడి వరకు వాహన రాకపోక లను నియంత్రించారు.

టమోటా కిలో రూ. 30

అనంతపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరి ష్ఠంగా రూ. 30తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమ వారం 675 టన్నుల టమోటా దిగుబ డులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 23, కనిష్ఠ ధర రూ. 16 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 35వేలు

అనంతపురం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 35,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరా సరి రూ. 24వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 75 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మార్మోగిన
సాయినామం..

సత్యసాయిబాబా జయంత్యుత్సవాలకు శ్రీకారం

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

తరలివచ్చిన దేశవిదేశీ భక్తులు

పులకించిన పుట్టపర్తి

పెద్దఎత్తున నారాయణసేవ

రెండేళ్లపాటు శతజయంతి ఉత్సవాలు: ఆర్జే రత్నాకర్



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



సీతారాముల పల్లకిని మోస్తున్న రత్నాకర్, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సాయినామం మార్మోగింది.. ఆధ్యాత్మిక పట్టణం పులకిం చిపోయింది. దేశవిదేశాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు సాయినామాన్ని స్మరిస్తూ భక్తి పార వశ్యం పొందారు. సత్యసాయి బాబా 99వ జయంత్యుత్స వాలకు సోమవారం పుట్టపర్తిలో శ్రీకారం చుట్టారు. తొలి రోజు శ్రీవేణుగోపాలస్వామి రథోత్సవం పట్టణ వీధుల్లో అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం 9 గంటలకు పెదవెంకమరాజు కల్యాణమంటపంలో వేణుగోపాల స్వామి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మంగళవాయి ద్యాలతో ప్రశాంతి నిలయం గోపురం వద్దకు తీసుకొ చ్చారు. సాయి కల్వంత్ మందిరంలో వేదపండితులు శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వ హించారు. సీతారాములు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాన్ని తీసుకు రాగా, సీతారాముల పల్లకిని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రశాంతి మందిరం గోపురం వద్దకు తీసు కొచ్చారు. స్వామి ఉత్సవవిగ్రహాన్ని రథంలో కొలువుదీ ర్చారు. ఆర్జే రత్నాకర్ పూజలు చేసి, రథోత్సవాన్ని ప్రారం భించారు. సీతారాముల పల్లకి, విద్యార్థుల వేదపఠనం, భక్తుల సాయినామస్మరణ, కోలాటం, చెక్కభజన, కీలుగు ర్రాలు, గొరవయ్యలు, డోలు, మంగళవాయిద్యాలు ముందువైపున సాగగా.. స్వామి రథం కదిలింది. ఎత్తైన భవనాల పైనుంచి రథోత్సవంపైకి భక్తులు పూల వాన కురిపించారు. దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులతో పురవీధులు కిక్కిరిశాయి. సత్యసాయి భజనలతో పట్టణ వీధులు పులకించాయి. చిన్నారులు వివిధ దేవతల వేష ధారణలు, కోలాటాలతో సందడి చేశారు. గురవయ్యలు గిరగిర నృత్యం, చెక్కభజనలు, కీలుగుర్రాలు, డోలు వాయిద్యాలతో సందడి చేశారు. పెద వెంకమరాజు కల్యాణమండపం రథోత్సవం సాగింది. అక్కడ రత్నాకర్ మంగళ హారతితో రథోత్సవాన్ని ముగించారు.

రెండేళ్లపాటు శతజయంత్యుత్సవాలు

శ్రీసత్యసాయి 99వ జయంతి ఉత్సవాలు ముగింపు నాటి నుంచి శత జయంత్యుత్సవాలను రెండేళ్లపాటు నిర్వహిం చనున్నట్లు ఆర్జే రత్నాకర్ తెలిపారు. ఈనెల 23న సత్య సాయి జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు నుంచే రెండేళ్లపాటు 2026 నవంబరు 23 వరకు సత్య సాయి శత జయంతి వేడుకలు నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రపంచ సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వంద దేశాలకుపైగా భక్తులు పాల్గొంటారన్నారు. సత్యసాయి చేపట్టిన సేవా కార్యక్రమా లను మరింత భక్తితో కొనసాగిస్తామన్నారు.

భక్తులకు నారాయణసేవ

సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నారాయణసేవ అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్జే రత్నాకర్ నారాయణ సేవను ప్రారంభిం చారు. 22 కౌంటర్లలో నారాయణ సేవను అందిస్తు న్నారు. ఈనెల 24 వరకు వారం రోజులపాటు భక్తు లకు అన్నదానం చేయనున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి సత్యనారాయణ వ్రతం

సాయికుల్వంత్ మందిరంలో శ్రీసత్యసాయి సత్యనారా యణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండి తులు సత్యనారాయణ వ్రతం నిర్వహించగా, 2500 మంది భక్తులు వ్రతపూజలో పాల్గొన్నారు. రెండు గంటలపాటు వ్రతాన్ని భక్తితో నిర్వహించారు.

అలరించిన సంగీత కచేరి

సాయంత్రం సాయికుల్వంత్ సభా మండపంలో డాక్టర్ ఓఎస్ అరుణ్ బృందం సంగీత కచేరి నిర్వహించింది. గంటపాటు వాయిద్య గానంతో భక్తులను మైమరపింప జేశారు. జయంతి వేడుకల్లో పాల్గొనే భక్తుల కోసం సత్య సాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఈనెల 25 వరకు వివిధ జబ్బులకు సంబంధించి వైద్యం అందిస్తున్నారు.

నేడు మహిళా దినోత్సవం

ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్‌లో మంగళ వారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహి స్తారు. మహిళా దినోత్సవంలో పాల్గొనడానికి దేశవిదే శాలకు చెందిన మహిళా ప్రతినిధులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు.



డోలు కొడుతున్న భక్తులు



కీలుగుర్రాలు..



నారాయణసేవ చేస్తున్న రత్నాకర్



శ్రీసత్యసాయి సత్య నారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్న పండితులు

చట్ట సభలో సిద్ధేశ్వరం

శాసన మండలిలో గళమెత్తిన కర్నూలు, కడప ప్రజాప్రతినిధులు

అలుగుపై పరిశీలించి, చేపడుతాం : మంత్రి నిమ్మల రామానాయుడు

ఇది సాధ్యమే: 2011లో ఐదుగురు నిపుణుల కమిటీ నివేదిక

కరువుసీమ నీటి కష్టాలు తీర్చే అలుగు

సిద్ధేశ్వరం సీమ రైతుల సెంటిమెంట్

కర్నూలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగు.. రాయలసీమ వెలుగు అనే నినాదంతో ప్రజా ఉద్యమంగా మారిన నీటిపారుదల సమస్య మీద ఎట్టకేలకు విధాన సభలో సోమవారం వాడివేడి చర్చ జరిగింది. కడప జిల్లాకు చెందిన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండీ ఫరూక్ సిద్ధేశ్వరంపై గళమెత్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం సీమ రైతుల సెంటిమెంట్.. అలుగు నిర్మాణంతో శ్రీశైలం జలా శయంలో చేరే పూడికకు అడ్డుకట్ట వేయవచ్చు.. తద్వారా ప్రాజెక్టు జీవిత కాలం పెంచడం ద్వారా తెలుగు రాష్ట్రాలకు సాగునీటి, తాగునీటి కష్టాలు తీర్చవచ్చని వీరు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఫైలును చెత్తబట్టలో పడే సింది. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఐదేళ్లలో సిద్ధే శ్వరం అలుగు గురించి మాట్లాడిన పాపాన పోలేదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో సిద్ధేశ్వరంపై చట్టసభలో చర్చ జరగడం ఆశావహ పరిణామం. దీంతో సీమ ప్రజల ఆకాం క్షగా, సెంటిమెంట్‌గా మారిన సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి సానుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని భావించవచ్చు. ఈ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

శ్రీశైలం ప్రాజెక్టు సామర్థ్యం 311 టీఎంసీలు. పూడిక చేరడంతో 215 టీఎంసీలకు పడిపోయింది. తాజాగా అంచనా వేస్తే 180 టీఎంసీలకు చేరుతుందని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. ఏటా 2.5 టీఎంసీల పూడిక జలాశయంలో చేరుతుందని అంచనా. అదే క్రమంలో శ్రీశైలం ఎగువన 1985లో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 21,500 క్యూసెక్కుల ప్రవా హంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. 2004లో అధికారం చేపట్టిన నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 44 వేల క్యూసెక్కులకు పెంచారు. రాయలసీమ జిల్లాలకు సాగు, తాగు నీరు అందించే తెలుగుగంగ కాలువ, ఎస్‌ఆర్‌బీసీ, గాలేరు-న గరి సుజల స్రవంతి (జీఎన్‌ఎస్ఎస్) ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు (హెచ్ఎన్ఎస్ఎస్)లు నిర్మించారు. కేసీ కాలువ కూడా సాగునీరు అందించేలా ముచ్చుమరి లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ఆయా ప్రాజెక్టులకు శ్రీశైలం ఎగువ నుంచే కృష్ణా వరద జలాలు మళ్లించాల్సి ఉంది. ఏటేటా పూడిక చేరడం, 854 అడుగుల దిగువకు డ్యాం నీటి మట్టం పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కృష్ణా జలాలు సీమ రైతులకు అందని ద్రాక్షే అవుతున్నది. ఈ సమస్యకు ఏకైక పరిష్కారం సంగమేశ్వరం చెంతన రెండు కొండల మధ్యలో 'సిద్ధేశ్వరం అలుగు' నిర్మాణమేనని ఏనాడో సాగునీటి నిపుణులు తేల్చారు. ఈ అలుగు సాధన కోసం రాయలసీమ సాగునీటి సాధన సమితి సహా వివిధ రాయలసీమ సంస్థలు పోరాటం చేస్తు న్నాయి. 2016 మే 31న వేలాది మంది రైతులు సిద్ధేశ్వరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆనాడు టీడీపీ అధికారంలో ఉంటే.. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాయకులు రైతుల ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. అధికారం చేపట్టాక ఐదేళ్ల సిద్ధేశ్వరం అలుగు ఊసే ఎత్తలేదు. తాజాగా టీడీపీ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ .. ఆ పార్టీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మండలిలో సిద్ధేశ్వరం గళం వినిపించారు.

2011లోనే నిపుణుల కమిటీ ఆమోదం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కోసం 2011 మార్చి 11న అప్పటి ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఏడబ్ల్యూ) ఎంకే రెహమాన్ ఛైర్మన్/కన్వీనర్‌గా ఐదుగురు ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ వేశారు. ఈ కమిటీలో మీడియం ఇరిగేషన్ ఈఎన్‌సీ పీఎస్ఆర్ సుబ్రమణ్యం, ఇరిగేష న్ ఈఎన్‌సీ సి. మురళీధర్, డబ్ల్యూబీపీ డైరెక్టర్ ఎం. సాంబ మూర్తి, కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ కె. జలంధర్ సభ్యులుగా ఉన్నారు. అధ్యయనం తరువాత ఈ కమిటీ 2011 ఆగస్టు 19న ఆ కమిటీ సమావేశమై కీలక అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. శ్రీశైలం ఎగువన కృష్ణా నదిపై రాయలసీమ కరువు పీడిత జిల్లాలకు సాగు, తాగునీరు అందించే 8 ప్రాజెక్టులు ఉన్నాయి. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని దిగు వకు విడుదల చేస్తున్నారు. డ్యాం నీటి మట్టం 854 అడుగు లకు తగ్గిపోతే సీమ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయలేని పరిస్థితి ఉంది. అదే జరిగితే కరువుసీమ జిల్లాలకు తాగు, సాగునీరు అందడం కష్టం అవుతున్నది. దీంతో రాయలసీమ కరువు ప్రాంతంలో తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలంటే సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం అవసరం ఉందని నిపుణుల కమిటీ నిగ్గుతేల్చింది. నాటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అదే క్రమంలో 854 అడుగుల నీటి మట్టంలో అలుగు నిర్మిస్తే.. శ్రీశైలంలో ఏటా చేరే 2.5 టీఎంసీ పూడికను సంగమేశ్వరం వెనుకాలే ఆపేసి డ్యాం జీవితకాలం పెంచవచ్చు.. అధిక వర దలు వస్తే పోతిరెడ్డిపాడు నుంచి వరదను మళ్లించి డ్యాంకు రక్షణ కల్పించవచ్చని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటు న్నారు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగు దేశం, వైసీపీ ప్రభుత్వాలు రెండూ పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో ఆ రెండు ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకతను మూటగ ట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విడత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో విధాన సభ వేదికగా సిద్ధే శ్వరం ఆ పార్టీ ఎమ్మెల్సీలే చర్చనీయాంశం చేయడం స్వాగతిం చాల్సిన పరిణామం.



సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ప్రదేశం

సిద్ధేశ్వరంపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

రాయలసీమ సెంటిమెంట్‌గా మారిన సిద్ధేశ్వరం అలుగు నిర్మించాల్సిందే అని కడప జిల్లాకు చెందిన రాయలసీమ పట్ట భద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గళమెత్తారు. ఈ ప్రాజెక్టు సాధ్యాసా ధ్యాలు, ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఏ విధరంగా ప్రయోజనమో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అంకె లతో సహా వివరించారు. అలుగుపై ప్రజల్లో ఆకాంక్ష బలంగా ఉంది.. రైతుల ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు... ప్రభుత్వం తప్పక చేపట్టాలని మంత్రి ఫరూక్ మండలిలో వాయిస్ వినిపించారు.

పరిశీలించి చేపడుతాం

ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మంత్రి ఫరూక్ అడి గిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల రామానా యుడు సమాధానం ఇస్తూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం వల్ల అదనపు నీటి సామర్థ్యం ఉంటే తప్పకుండా పరిశీలించి చేపడుతామని వివరిం చారు. 2013 జూన్ 26న అప్పటి ప్రభుత్వం 2120 మెమో ఇచ్చింది. శ్రీశైలం ఫోర్‌షోర్ ఏరియాలో మరో డ్యాం నిర్మాణం వల్ల అదనంగా నీటి నిల్వ ఉండదని, ఆ ప్రాజెక్టు అవసరం లేదని తేల్చిచెప్పారు. 2016-17లో మళ్లీ సిద్ధేశ్వరం ప్రతిపాదన వచ్చింది. అంతర్ రాష్ట్ర సమస్య ఉందని, దీని వల్ల ప్రయోజనం లేదని 2018 సెప్టెంబరు 12న ఆనాటి ఈఎన్‌సీ కూడా లేఖ ఇచ్చారని ఆయన అన్నారు. రాయలసీమ ప్రాంతానికి నీటి ఇచ్చే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే హంద్రీనీవాకు రూ.2,500 కోట్లు కేటాయించి విస్తరణ చేపట్టబోతున్నామని తెలిపారు. సిద్ధేశ్వరంపై కూడా అధ్యయనం చేసి అదనపు నీటి నిల్వకు అవకాశం ఉంటే .. రాయలసీమ రైతులకు ఉప యోగకరంగా ఉందంటే తప్పక చేపడుతామని మంత్రి అన్నారు.

మంత్రి నిమ్మల డొంకుతిరుగుడు సమాధానం

సిద్ధేశ్వరంపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం డొంకతిరుగుడుగా ఉంది. 2011లోనే ఐదుగురు నిపుణుల కమిటీ సిద్ధేశ్వరం నిర్మాణం అవసరం ఉందని నివేదిక ఇచ్చింది. ఏటా 2.50 టీఎంసీలు పూడిక శ్రీశైలంలో చేరుతు న్నది. ఇప్పటికే 311 టీఎంసీలు నుంచి 215 టీఎంసీలకు తగ్గింది. తాజాగా అంచనా వేస్తే 180 టీఎంసీలు కూడా ఉండదు. అంటే దాదాపు 100 టీఎంసీలు సామర్థ్యం కోల్పోయాం. సిద్ధేశ్వరం అలుగు ద్వారా పూడికకు కట్టడి చేసి శ్రీశైలం డ్యాం జీవిత కాలం పెంచవచ్చు. అదనపు సామర్థ్యం ఉండదని ప్రతిపాదన తుంగలో కలిపే ప్రయత్నం చేయకూ డదు.

- బొజ్జ దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు

చిరుతల దాడి
50 గొర్రె పిల్లల మృతి



శింగనమలలో చిరుతల దాడిలో చనిపోయిన గొర్రె పిల్లలు

శింగనమల, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని మాలకొండ వద్ద చిరుతలు దాడి చేయ డంతో 50 గొర్రెపిల్లలు మృతి చెందా యి. శింగనమలకి చెందిన నాగలాపురం రాఘవ, ఎరికిల నాగరాజు మాల కొండ చాకరేవు గుట్ట వద్ద గొర్రెల మంద తోలారు. కాపరులు సోమవారం ఉదయం గొర్రెలను మేతకు తీసుకెళ్తూ 60 పిల్లలను ఒక చోట చేర్చి, ఇనుప కడ్డీ లతో చేసిన కంచెవేసి వెళ్లారు. సాయం త్రం తిరిగి వచ్చి చూడగా కంచెలో ఉన్న 50పైగా గొర్రెల పిల్లలను చిరుతలు దాడి చేసి చంపేసినట్లు గుర్తించారు. నాగలా పురం రాఘవ చెందిన 32 గొర్రెపిల్లలు, ఎరికల నాగరాజు చెందిన 18 గొర్రెపిల్లలు మృతి చెందాయి. రూ.లక్షపైగా నష్టం వాటిల్లినట్లు కాపారులు వాపోయారు. మాలకొండ ప్రాంతంలో దాదాపు ఐదు చిరుతలు తిరుగుతున్నా యని, ప్రతి రోజు ఎక్కడో ఒక చోట జీవాలపై దాడి చేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

1.588 టీఎంసీల నీటినిల్వ

బెళుగుప్ప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.588 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వా యర్‌లో ఇన్‌ఫ్లో 1087 క్యూసెక్కులుం డగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 990 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

పోలీసు శాఖలో భారీగా బదిలీలు
వీఆర్‌కు సీఐ మోహన్... పలువురు ఎస్‌ఐలు, 74 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం

పుట్టపర్తి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు శాఖలో పెద్దఎత్తున బదిలీలు చేశారు. వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న సీఐ, పలువురు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఎస్పీ రత్న ఉత్తర్వులు జారీ చేశారు. కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ మోహన్‌ను వీఆర్‌కు పంపారు. జిల్లా వీఆర్‌లో ఉన్న నిరంజన్‌రెడ్డిని కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులి చ్చారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలు మునిప్రతాప్‌ను హిందూపురం రూరల్ స్టేషన్‌కు, రాజకుళ్లాయప్పను గుడిబండకు, ఇసాక్‌బాషాను ముదిగుబ్బకు, మహమ్మద్ అలీని సీసీఎస్‌కు, రమణారెడ్డిని కదిరిరూరల్‌కు, రాజాప్ర సాద్‌ను హిందూపురం టూటౌన్‌కు, జయప్పను వీసీఆ ర్‌కు, బ్రహ్మానందరెడ్డిని హిందూపురం టూటౌన్‌కు, కియ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న నజీర్ అహమ్మద్‌ను రోడ్ సేఫ్టీ పెనుకొండ సబ్‌డివిజన్‌కు, చెన్నేకొత్తపల్లిలో పనిచే స్తున్న సూర్యనారాయణను రోడ్‌సేఫ్టీ ధర్మవరం సబ్‌డివి జన్‌కు బదిలీ చేశారు. ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయనీ, బదిలీ అయిన స్థానాల్లో వెంటనే రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

74 మంది కానిస్టేబుళ్లు..

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 74 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులిచ్చారు. జిల్లా ఏర్పడిన రెండేళ్లలో ఇంత భారీగా కానిస్టేబుళ్ల బదిలీలు చేపట్టడం ఇదే ప్రథమం.

క్రైంకార్నర్

ఆటో బోల్తా
పదిమందికి గాయాలు - ఇద్దరి పరిస్థితి విషమం

గుత్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి తిరిగి స్వగ్రామా నికి వెళ్తుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో పది మంది గాయపడ్డారు. ఈ సంఘటన పట్టణ శివారు గుంతకల్లు రోడ్డు చెరువుకట్ట సమీపంలో సోమవారం జరిగింది. నంద్యాల జిల్లా నందివర్గం గ్రామానికి చెందిన హనుమన్న తన కుటుంబసభ్యులు పిల్లలు, పెద్దలు 15 మంది ఆటోలో ఆదివారం గుంతకల్లు మండలం లోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. తిరిగి అదే ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా పట్టణంలోని గుంత కల్లు రోడ్డు చెరువు కట్ట వద్ద ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. స్థానికులు గమనించి ఆటోలో ఉన్నవారిని బయటకు తీశారు. గాయపడిన వారిని మరో ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో హనుమన్న, అంజినమ్మ, రామాంజినేయులు, తిరుమలమ్మ, లక్ష్మీనా రాయణతో పాటు మరో ఐదుగురు ఉన్నారు. వీరిలో అంజినమ్మ, హనుమన్న పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



కంప చెట్లలో బోల్తా పడిన ఆటో

గోమాంసం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



గోమాంసం తరలిస్తున్న కారు

గోరంట్ల, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గోవధ శాలలు, మాంసం ర వాణాపై పోలీసులు పదేప దే దాడులు చేస్తున్నా వారి లో మార్పు రావట్లేదు. య థేచ్ఛగా రవాణా చేస్తున్నారు. మండలంలోని గుమ్మయ్యగా రిపల్లి కూడలిలో 400 కిలోల గోమాంసాన్ని కారులో తరలిస్తుండగా పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. కారులో గోమాంసం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. కర్ణాటకలోని బాగేపల్లి వాసి హైదర్‌అలీ, గోరంట్లకు చెందిన తండ్రి, కొడుకు షేక్ అన్సర్, అన్వర్ సాబ్‌ను అరెస్టు చేశారు. కారుతోపాటు కవర్లలో ప్యాకింగ్ చేసిన మాంసాన్ని పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న 16 మంది...

అనంతపురం క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు ఆడుతున్న 16 మందని ఇటుకలపల్లి పోలీసులు పట్టుకున్నారు. రెండు రోజుల కిందట ఉప్పరపల్లి సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తునట్లు సమాచారం అందడంతో సీఐ హేమంత్‌కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహిం చారు. అయితే అప్పుడు అక్కడున్న వారంతా వాహనాలు కూడా పరారు కాగా ఒకరు మాత్రం దొరికారు. ఆ వ్యక్తి, వాహనాల ఆధారంగా ఆరా తీసిన పోలీసులు సోమవారం 16మందిని అ రెస్ట్ చేశారు. వారి నుంచి 60,100లు, రెండు పందెం పుంజుకోళ్లు, 4 కోడి కత్తులు, 18 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసు కున్నాడు. రాజీవ్‌కాలనీకి చెందిన ఎరుకుల ఏడుకొం డలు(20) గంగిరెద్దులు, ఆవులను కొత్త ఇళ్లల్లోకి తీసు కెళ్లే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు 16 ఏళ్లకే పెళ్లి జరిగింది. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇతను గత కొంతకాలంగా తాగుడుకు అలవాటుప డ్డాడు. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం తన ఇంట్లోనే మద్యంలోకి ఎలుకలమందు కలుపుకుని తాగాడు. అపస్మారస్థితిలో పడిపోయిన అతడని కుటుంబసభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఆత్మహ త్యకు కారణాలు తెలియరాలేదు. త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఉద్యోగి ...

అనంతపురంలోని సోమనాథ్‌నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి జయరామ్‌శెట్టి(25) విషద్రావకం తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం రూరల్ మండలం పోతుకుంటకు చెందిన జయరాం శెట్టి భార్య ఇటికల జయనందినితో కలిసి సోమనాథ్ నగర్‌లో నివాసముంటున్నాడు. వారికి పిల్లలు లేరు. మద్యం ఎక్కువగా తాగేవాడు. ఈ క్రమంలో భార్యాభ ర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో మన స్తాపం చెందిన జయరామ్‌శెట్టి ఆదివారం తన గది లోకి వెళ్లి కురులకు వాడే ద్రావకాన్ని తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రాత్రికి మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తం

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నార్పల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండో విడతలో భాగంగా నార్పలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పీఎంకేవీవైసెంటర్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ డెవిడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డెటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌లో మూడు నెలలు శిక్షణ ఇస్తారన్నారు. ఇంటర్, ఆ పైన విద్యార్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్‌ఫోన్ నంబరు 9010039901కు సంప్రదించాలని తెలిపారు.

అహుడా చైర్మన్‌కు సత్కారం


టీసీ వరుణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దివే కృష్ణమూర్తి

గార్లదిన్నె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనసేనా పార్టీ జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌ను సోమవారం మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి దివే కృష్ణమూర్తి కలిశారు. అనంతపురంలోని టీసీ వరుణ్ నివాసంలో శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీసీ వరుణ్‌ను అహుడా చైర్మన్‌గా నియమించడంతో జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నెలకొందని అన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి


రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని కందుకూరులో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను టీడీపీ నాయకులు సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు రూ.5కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళి, నాయకులు నారాయణస్వామి, దాదులూరు, రాము పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

రాప్తాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండల వ్యాప్తంగా దాదాపు 35పైగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. వాటి స్థానంలో బాగున్న ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో అందకపోవడంతో రైతులు పంటలు నష్టపోతున్నారనే విషయంపై 'రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ రాప్తాడు ఏఈ శివప్రసాద్ కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు బదులుగా బాగున్న ట్రాన్స్‌ఫార్మర్లను రైతులందరికీ అందజేశారు.

హెల్మెట్ తప్పని సరి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను పూర్తిగా నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీఎస్పీతోపాటు రామగిరి సీఐ శ్రీధర్ చేతుల మీదుగా పాత్రికేయులకు హెల్మెట్లను పంపిణీచేశారు. డీఎస్పీ మాట్లాడుతూ... ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం వల్ల కొంత మేర ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. పోలీసులు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసులు, పాత్రికేయులు హెల్మెట్లు ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు.



మొదటి రోడ్డులో ముక్కంటి దర్శనానికి బారులుదీరిన భక్తులు

దీపం జ్యోతి... పరబ్రహ్మ

● భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు ● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక దీపం వెలగిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం కల్చరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలన్నీ భక్తకోటితో కిక్కిరిసి పోయాయి. భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ముక్కంటిని దర్శించుకున్నారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలోని శివుడికి రుద్రాభిషేకాలు, బిల్వార్చన, విశేష అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తులు దీపాలను వెలిగించి, కాశీవిశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరై స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని ఎమ్మెల్యేకి అందజేశారు. అనంతరం ఆమె ఆలయ ఆవరణలో కార్తీక దీపం వెలిగించారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆరో రోడ్డులోని అమృతలింగేశ్వరాలయంలో అన్నాభిషేకం చేశారు. శారదా నగర్‌లోని శృంగేరి శంకరమఠం, పాతూరు విరూపాక్షేశ్వర దేవాలయం. మూడోరోడ్డు షిర్డిసాయిబాబా ఆలయం, బెంగళూరు రోడ్డులోని శివకోటి ఆలయం, శివబాలయోగి ఆశ్రమం హౌసింగ్‌బోర్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణం, శివాలయంలో భక్తులు పెద్దఎత్తున కార్తీక దీపాలను వెలిగించారు.


మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరుడు


శివబాలయోగి ఆశ్రమంలో క్షీరాభిషేకం



ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ


స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగర శివారులోని హార్మోనిసిటీలో సోమవారం సాయంత్రం అయ్యప్ప స్వామి పడిపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బళ్లారి నుంచి వచ్చిన గురుస్వామి ఓంకారస్వామి సమక్షంలో హార్మోనిసిటీ సీఎండీ నెట్టెం రవికుమార్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తికి నదీ జలాభిషేకం చేసి, విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అయ్యప్ప దీక్ష ధారులు స్వామివారి కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు. మహా మంగళహారతి నివేదనానంతరం దాదాపు 55 మంది దీక్షదారులకు భిక్ష అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎస్ స్కూల్ డైరెక్టర్ క్రిష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి: ఎమ్మెల్యే


ఎమ్మెల్యేని కలిసిన కడియాల కొండన్న, కుటుంబ సభ్యులు

అనంతపురం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా కడియాల కొండన్నను నియమించిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులతో సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందనేందుకు కొండన్నకు డైరెక్టర్ పదవి రావడమే నిదర్శనమన్నారు.

జేఎన్‌టీయూ డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ


డైరెక్టర్ దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న వీసీ

అనంతపురం సెంట్రల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ డైరెక్టర్లు పలువురు ప్రొఫెసర్‌లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్‌గా దుర్గాప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌గా సురేష్‌బాబు, ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌గా కిరణ్మయి వారి కార్యాలయాల్లో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ఓఎస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తితో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది వారిని అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో తరిమెల విద్యార్థినికి రజతం



రజత పతకం సాధించిన దిల్షాద్ (కుడివైపు)

శింగనమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో తరిమెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని దిల్షాద్ రజత పతకం సాధించింది. రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎస్‌జీఎస్ పోటీలు గుడివాడలో ఈనెల 16న నిర్వహించారు.. పోటీలలో బాలికల అండర్- 19 విభాగం వెయిట్ లిఫ్టింగ్‌లో దిల్షాద్ పాల్గొన్ని రాష్ట్ర స్థాయి రజత పతకం సాధించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

భారత పార్లమెంటు వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం

● సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఎస్ఏ కోరి

అనంతపురం సెంట్రల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మన పార్లమెంట్ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శనీయమని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో యూత్ పార్లమెంట్ పోటీలను నిర్వహించారు. వీసీ కోరి ముఖ్య పోషకులుగా వ్యవహరించారు. ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలైన పార్లమెంట్, న్యాయ, పోలీసు, మీడియాల్లో పార్లమెంటరీది ప్రథమ స్థానమని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అమలుకు చట్టాలుచేసి అమలుచేసే బాధ్యత పార్లమెంట్ తీసుకుంటుందన్నారు. ప్రతి విద్యార్థి మన పార్లమెంట్‌పై అవగాహన పెంపొందించుకోవాలని, సభ్యులుగా భాగస్వామ్యం అయ్యేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం పార్లమెంట్ స్వీకారం, సంస్మరణ, స్వీకారం, సూచనలు, క్వశ్చన్ అవర్, కాలింగ్ అటెన్షన్, శాసన కార్యాకలాపాలు ప్రతిబించేలా మోడల్ యూత్ పార్లమెంట్‌ను నిర్వహించారు.

ఎస్పీని కలిసిన పచ్చిటెంకాల వ్యాపారులు

అనంతపురం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పచ్చిటెంకాల వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంబంధిత వ్యాపారులు ఎస్పీ జగదీష్‌ను సోమవారం కలిశారు. మండలంలోని కురుగుంట సర్వే నెంబరు 320-1లో తమకు సంబంధించిన ఇంటి స్థలాల గురించి ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న మాట్లాడుతూ... తనకు పాతికేళ్ల కిందట పట్టాలు మంజూరు చేశారన్నారు. స్థానికంగా మౌలిక వసతులు లేని కారణంగా ఇంటి నిర్మాణం చేసుకోలేదన్నారు. అయితే ఇప్పుడు ఇల్లు కట్టుకుందామనుకున్నా... కొంతమంది నాయకులు అడ్డుకుంటున్నారని వివరించారు. తమకు ఇచ్చిన పట్టాలు వాస్తవ మని రెవెన్యూ చెప్పినప్పటికీ తమను తమ స్థలాల్లోకి రాన్వీడం లేదని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే ఎస్పీని కలిశామన్నారు. తమకు న్యాయం జరిగేవిధంగా చేస్తామని ఎస్పీంచెప్పారన్నారు. కార్యక్రమంలో వ్యాపారులు శారద, శంకర్, గంగాధర్, శ్రీకాంత్, అంకన్న, సరళ కమల తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

నార్పల/రామగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నార్పల శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరుగు పందెం పోటీలను నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. రామగిరి గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

విధులకు ఇబ్బందులు కల్గిస్తే చర్యలు తీసుకోవాలి

● ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట అంగన్‌వాడీల ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సిబ్బంది విధులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకులు లింగన్న, రమేశ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. విధుల్లో సిబ్బందికి రక్షణ కల్పించాలని వారు కోరారు. సీఐటీయూ నాయకుడు లింగన్న మాట్లాడుతూ... విధులకు వస్తున్న రామగిరి మండలం చెర్లోపల్లి, మంగాపురం అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేసే ఆయాలు లక్ష్మీనరసమ్మ, ఇంద్రజను ఆయా గ్రామాలలో స్థానికంగా కొందరు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీంతో వారికి రక్షణ కల్పించాలని కోరారు. సీడీపీఓ కవితాదేవి వారి వద్దకు వచ్చి సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు రమణమ్మ, లక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే ఖాళీ

● డ్యూటీ నర్సుతోనే వైద్యం
● శింగనమల సీహెచ్‌సీ ఇష్టారాజ్యం


మధ్యాహ్నం ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు



సాయంత్రం 4గంటలకే ఆస్పత్రికి తాళం

శింగనమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : పేరుకే కమ్యూనిటీ హెల్త్ సెంటర్. దీంతో రోగులు ఇది పెద్ద ఆస్పత్రి అని చికిత్స కోసం వస్తారు. అయితే ఇక్కడి పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. వచ్చిన వారు నిరాశతో వేరొక చోటుకు వెళ్లాల్సి వస్తోంది. సోమవారం ఆంతధ్రజ్యోతి విజిట్‌లో ఈ విషయాలు బయటపడ్డాయి. శింగనమల కమ్యూనిటీ ఆసుపత్రిలో ఐదుగురు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వారంతా ఉదయం అంటుబాటులో ఉండాలి. వారంతా సోమవారం ఉదయం ఆసుపత్రికి వచ్చారు. అయితే అందులో నలుగు మధ్యాహ్నం 12.30 గంటలకు వెళ్లి పోయారు. సాయంత్రం 4గంటల సమయంలో ఆ ఒక్కరు కూడా లేరు. ఆ సమయంలో మండలపరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన మహిళ, నాగుల గుడ్డం తండాకు చెందిన వ్యక్తి వైద్య చికిత్సల కోసం వచ్చారు. పిల్లల వైద్యుడు కార్యాలయంలో ఉన్నారని ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. అయితే అక్కడే ఉన్న నర్సు వచ్చిన రోగులకు ఇంజక్షన్ వేసి, కొన్ని మాత్రలు ఇచ్చి పంపారు. వైద్యుడు ఎక్కడ అని సిబ్బందిని విచారించగా... సారు ఆఫీస్ పని మీద వెళ్లి పోయాడని గాబరా గాబరాగా చెప్పారు. ఇది 30 పడకల ఆసుపత్రి. సాయంత్రం, రాత్రి వైద్యులు అందుబాటు లేకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రాత్రి సమయంలోనూ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

21న ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-19 బాల, బాలికల క్రికెట్ పోటీలు ఈనెల 21వ తేదీన నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్-19 జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆరోతరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న క్రీడాకారులు అర్హులన్నారు. వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9441284618ను సంప్రదించాలని కోరారు.

ఢిల్లీ కోచ్‌లతో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విదేశాలకే పరిమితమైన రగ్బీ ఆటపై జిల్లాలో క్రీడాకారులకు ఢిల్లీ కోచ్‌లతో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జిల్లాలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఏజీఎస్ స్కూల్‌లో నిర్వహించారు. ఢిల్లీకి రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ కోచ్ మోయాలి మాథ్యూ ఆటు సభ్యులకు, ఇటు కోచ్‌లకు ప్రత్యేక శిక్షణలో అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన క్రీడా పాలసీకి అనుగుణంగా ఆటను జిల్లాలో మెరుగుపరుస్తామని సభ్యులు తెలిపారు. రగ్బీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ సంపత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఆపరేషన్ డైరెక్టర్ రాజశేఖర్, కోచ్‌లు సుమంత్, సుదర్శన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో జిల్లావాసులకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరాటే సౌత్‌జోన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌లో ఆదివారం నిర్వహించిన నేషనల్ మూడో ఓపెన్ సౌత్‌జోన్ కరాటే చాంపియన్‌షిప్-2024 టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ముగ్గురు బంగారం, నలుగురి రజతం, ఐదుగురు కాంస్య పతకాలు సాధించారు. జిల్లా కరాటే కోచ్ దినేష్ విజేతలను అభినందించారు.

ఘనంగా కనకదాస జయంతి


కనకదాసకు నివాళులర్పిస్తున్న కొనకొండ్ల రాజేష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కురుబ, బీసీ సంఘాల నాయకులు పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుత్తిరోడ్డులోని కనకదాస విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆ సంఘం నాయకులతో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా కురుబ సంఘం నాయకుడు కొనకొండ్ల రాజేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురబ సంఘం నాయకులు రత్నమయ్య, లక్ష్మీదేవి, అశోక్‌రెడ్డి, లలిత్‌కుమార్, కాటమయ్య, చంద్ర, ఈశ్వర్‌ప్రసాద్, నాగేంద్ర, ఇలియాజ్, నాగరాజు, గౌడ్, శివ, రవి, ప్రదీప్, దిలీప్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సురేంద్రగౌడ్, రామలింగయ్య, విష్ణువర్ధన్, మనోజ్‌కుమార్, కేశవగౌడ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి

● టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు


మర్తాడులో కనకదాస జయంతి వేడుకలు

గార్లదిన్నె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కురుబ ఆవుల క్రిష్ణయ్య పేర్కొన్నారు. కురుబ కులస్థుల ఆరాధ్యదైవం భక్త కనకదాస జయంతి వేడుకలను సోమవారం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సాయంత్రం గ్రామంలో కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆవుల క్రిష్ణయ్యతోపాటు కురుబ సంఘం నాయకులు పాండు, బ్యాళ్ల ఈశ్వరయ్య, శేఖర్, ఆవుల శ్రీనివాసులు, ఆవుల శీనా, ఆవుల సురేష్, రాము, పూజారి సంజప్ప, బండి శీనా, గుర్రప్ప, ఆవుల రామాంజి, కలుగురి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


శేషంపల్లిలో జ్యోతులు, బోనాలతో వెళ్తున్న మహిళలు

భక్త కనకదాస జయంతిని కురుబ కులస్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతపురం నగరంతోపాటు రూరల్ మండలం, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. చెన్నేకొత్తపల్లిలోని టీడీపీ కార్యాలయంలో కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామగిరి మండలంలోని శేషంపల్లిలో మహిళలు జ్యోతులు, బోనాలను మోసుకెళ్లి కనకదాసకు సమర్పించారు. - ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

కనకదాస జీవితం ఆదర్శనీయం : జేఎన్‌టీయూ వీసీ

అనంతపురం సెంట్రల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస జీవిత చరిత్ర విద్యార్థులకు ఆదర్శనీయమని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. సోమవారం జేఎన్‌టీయూలో కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ఓఎస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న కనకదాస చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కనకదాస జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి సవితకు ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ నాగ భూషణం కృతజ్ఞతలు తెలిపారు. భక్త కనకదాస బహుజన ఆరాధ్య దైవమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కొనియాడారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

శింగనమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాలయాల్లో కార్తీక మూడో సోమవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగనమల చిన్నకాలువ శివాలయం, నీలాకంఠేశ్వరస్వామి, నగరేశ్వరి, ఆత్మసీతారాములు, చిన్నజలాలపురం దోనరామేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దోనరామేశ్వర స్వామి ఆలయంలో ఆలయ పునర్నిర్మాణ కర్త అన్నదానం చేశారు. సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించారు.

క్లుప్తంగా..

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కన్నపల్లి గ్రామశివారులోని పొలాల్లో సోమవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.19100 నగదును, 52పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోడిపందెం నిర్వాహకులు..

కూడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో కోడి పందెం నిర్వాహకులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కోడిపెందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే సీఐ శివరాముడు ఆధ్వర్యంలో దాడులు చేశారు. అందులో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10.500 నగదు, 14 ద్విచక్రవాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వారిపై కేసు నమోదు చేశారు.

బండల ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ-తాడిపత్రి రహదారిలో సోమవారం తొమ్మిది బండల ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వాహనాల తనిఖీ నిమిత్తం బండల ట్రాక్టర్లను తనిఖీ చేశామన్నారు. వీటిలో డ్రైవర్లకు లైసెన్సు లేకపోవడం, అధికటన్నేజీ, అధిక వేగంతో వెళుతున్నట్లు గుర్తించామని, దీంతో వెంటనే ట్రాక్టర్లను సీజ్‌చేసి జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

60 మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడిపత్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం చింతకుంట గ్రామ సమీపంలో సోమవారం 60మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు. యల్లనూరు మండలం బుక్కాపురానికి చెందిన గోపాల్ అక్రమంగా మద్యం తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బంది తో కలిసి చింతకుంట క్రాస్ వద్ద కాపు కాచామన్నారు. అటుగా వచ్చిన గోపాల్‌ను తనిఖీ చేసి మద్యంబాటిళ్లతోపాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గంరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని అక్రమంగా అమ్ముతున్న హనుమంతప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సోమశేఖర్ తెలిపారు. గుమ్మఘట్ట మండలం మానంపల్లి గ్రామానికి చెందిన హనుమంతప్ప ఇంట్లో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు సిబ్బందితో గ్రామానికి వెళ్లి తిప్పేస్వామి ఇంటి ఆవరణను పరిశీలించగా మూడు బాక్సుల కర్ణాటక మద్యం లభ్యమైంది. వెంటనే దానిని స్వాధీనం చేసుకున్నామి, హనుమంతప్పపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నామని సీఐ పేర్కొన్నారు.

బంగారు నగల రికవరీ

యల్లనూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మూడునెలల క్రితం జరిగిన బంగారు నగల చోరీకేసులో నిందితుడు కోలాటం శంకర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. గత జూలై 15న మండలకేంద్రంలో కోలాటం పెద్దక్క ఇంటిలో మూడున్నర తులాల బంగారు నగలు చోరీ అయినట్లు కేసు నమోదైంది. ఈ కేసు విచారణ చేపట్టగా పెద్దక్క కుమారుడే ఈ చోరీచేసినట్లు విచారణలో తేలింది. నిందితుడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక డంపు సీజ్

డీ.హీరేహాళ్, నవంబరు 18: అక్రమంగా నిలువ ఉంచిన ఇసుకను ప్రభుత్వ అధికారులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని కాదలూరు గ్రామ సమీపంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెద్దఎత్తున ఇసుకను నిల్వచేశారు. ఆ ఇసుకను కర్ణాటక ప్రాంతాలకు తరలించేందుకు నిల్వ చేసుకున్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది అక్కడికి వెళ్లి అక్కడ కుప్పలుగా ఉన్న ఇసుకను పరిశీలించారు. అనంతరం మైన్స్ అండ్ జియాలజీ అధికారుల చేత పంచనామా నిర్వహించి ఆ ఇసుక డంప్‌ను సీజ్ చేశారు.

యువకుడి ఆత్మహత్య



హనుమంతు (ఫైల్)

రాయదుర్గంరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్రవన్నూరు గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. డీ.హీరేహాళ్ మండలం మడేనహళ్లికి చెందిన హనుమంతుకు మూడేళ్ల క్రితం వద్రవన్నూరు గ్రామానికి చెందిన పార్వతితో వివాహం జరిగింది. అప్పటి నుంచి అతను అత్తగారి ఇంట్లోనే కాపురం ఉండేవాడు. ఈ క్రమంలో కుటుంబంలో గొడవలు రావడంతో మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడు. అయితే ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి లక్ష్మణ్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో పెయింటర్ మృతి



నూర్ బాషా (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మారంపల్లి కాలనీ సమీపంలోని రేషన్ తోటలో అనుమానాస్పద స్థితిలో పెయింటర్ నూర్ బాషా (36) మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన నూర్‌బాషా 16 ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఏమైందోఏమో గత కొన్ని రోజుల నుంచి ఇంటికి వెళ్లకుండా బయటే ఎక్కువగా ఉండే వాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంటి సమీపంలోనే రేషం తోటలో ఓ చింతచెట్టుకు చీరతో ఉరి వేసుకున్నాడు. స్థానికులు కొందరు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అతడిని కిందకు దించి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందాడు. అయితే మృతుడి కాళ్లు నేలకు తాకుతుండటంతో నూర్ బాషా మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర

- కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



తాడిపత్రిలో విశేషఅలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కార్తీక మాస మూడో సోమవారం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వే కువజామునే అర్చకులు ఆలయాల్లో మూలవిరాట్‌లకు రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అలంకరణలు, పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి దర్శనం చేసుకుని అర్చనలు చేయించారు. అలాగే ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీ పాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మిగతా ఆలయాల్లోనూ కార్తీక మాస పూజలు జరిగాయి. కార్తీక దీప కాంతులతో ఆలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరాలయంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని యాలకులతో అలంకరించి పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు.



పామిడిలోని భోగేశ్వరాలయంలో శివలింగాకృతిలో దీపాలంకరణ

ఫ్లెక్సీ చింపివేత

డీ.హీరేహాళ్, నవంబరు 18: మండలంలోని ఓబుళాపురంలో టీడీపీకి చెందిన కొందరు కురుబలు కనకదాసు జయంతి సందర్భంగా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీన్ని ఓర్వలేని గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మంగలి సర్వేశ్ సోమవారం దౌర్జన్యంగా ఆ ఫ్లెక్సీని చించేశాడు. ఈ దుశ్చర్యకు పాల్పడిన సర్వేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు బసవ, బసప్ప తదితరులు మండలకేంద్రంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చించేసిన ఫ్లెక్సీ

ఘనంగా కనకదాస జయంతి

- చిత్రపటాలకు , విగ్రహాలకు పూజలు



గుంతకల్లులో కనకదాస విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు



వజ్రకరూరులో పాలాభిషేకం

కళ్యాణదుర్గం/తాడిపత్రి/ ఉరవకొండ/ బొమ్మనహాళ్/ కణేకల్లు/గుంతకల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కురుబల ఆరాధ్యుడు కనకదాస జయంతి వేడుకలను కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదిక వద్ద సోమవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనకదాస జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. కురుబల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మోరేపల్లి మల్లికార్జున, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి, మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పాపంపల్లి రామాంజనేయులు, కంబదూరు మండల కన్వీనర్ శివన్న మాజీ కన్వీనర్ డీకే రామాంజినేయులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు డిష్ మురళి, కురుబసంఘం నాయకులు, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కురుబలు పాల్గొన్నారు.

●తాడిపత్రి పట్టణంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవికుమార్‌నాయుడు కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఆదినారాయణస్వామి, అధ్యాపకులు నాగరాజు, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●ఉరవకొండ పట్టణంలో కురుబలు కనకదాస చిత్రపటాన్ని స్థానిక కురుబసంఘం కార్యాలయం నుంచి పురవీధుల గుండా ఊరేగించారు. అలాగే వజ్రకరూరు మండలంలోని గడేచిన్నహోతూరులో విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. కురుబసంఘం నాయకులు ఆకుకూరల నాగరాజు, చేజాల ప్రభాకర్, జియో శీన, బ్యాళ్ల ఈశ్వరయ్య, లింగన్న, తిమ్మప్ప, సదానంద, పూజారి లింగన్న పాల్గొన్నారు.

●బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మునివేలు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, కురుబ సంఘం మండలఅధ్యక్షుడు నాగరాజు కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఎంఈఓ మల్లికార్జున, టీడీపీ నాయకులు పయ్యావుల మోహన్, ఉద్దేహాళ్ శివ తదితరులు పాల్గొన్నారు.

● కణేకల్లులోని సాయిబాబా ఆలయం వద్ద గల కనకదాస ఆశ్రమంలో కురుబలు మహేష్, నందు, ప్రకాష్, అఖిల్, రాజన్న తదితరులు కనకదాస చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు.

● గుంతకల్లు పట్టణంలోని పాత గుంతకల్లులో గల బీరప్ప సర్కిల్లో కనకదాస విగ్రహానికి టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి పూలమాల వేసి పూజలు చేశారు. నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, ప్రతాప్‌నాయుడు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, బొజ్జేనాయక్, అంజి, ఫజుల తదితరులు పాల్గొన్నారు. తొలుత 5వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

గుంతకల్లుటౌన్/బొమ్మనహాళ్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ మండలం చంద్రగిరి గ్రామంలో బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తిశెట్టిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలోని ఆ పార్టీ నాయకులు సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్ మాట్లాడుతూ.. కృష్ణమూర్తిశెట్టి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భూతగాదాల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలం చెందారన్నారు. దీని వల్ల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు భూతగాదా సమస్యలపై స్పందించి పరిష్కరించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, కొలిమి రామాంజనేయులు, జీఎం మహేష్, గుర్రంసూర్యనారాయణ, దాసరి శ్రీనివాసులు, శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం రాయదుర్గం నియోజకవర్గ నాయకులు బొమ్మహాళ్ మండల కేంద్రానికి వచ్చి కృష్ణమూర్తిశెట్టిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు నాగళ్లి రాజు, జయంతి సురేష్, హీరోజీ రావు తదితరులు పాల్గొన్నారు.

వేటకొడవళ్లతో హల్‌చల్

కణేకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో సోమవారం సాయంత్రం ముగ్గురు వ్యక్తులు వేటకొడవళ్లతో హల్‌చల్ చేశారు. ఏపీ 21 ఏడబ్ల్యూ 1332 నంబరు గల ద్విచక్రవాహనంలో వచ్చిన ఆ ముగ్గురు వేటకొడవళ్లతో నిలబడి ఉండగా స్థానికులు గమనించారు. వేటకొడవళ్లతో ఇక్కడ ఏమి చేస్తున్నారంటూ ప్రశ్నించి ఫోటోలు తీయడానికి ప్రయత్నించారు. దీంతో సదరు వ్యక్తులు అక్కడే బైక్‌ను వదిలేసి పరారయ్యారు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

హాకీలో రాష్ట్ర జట్టుకు హావళిగి విద్యార్థి



నందు

విడపనకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నందు రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం సర్వమంగళ, పీడీలు శ్రీనివాసులు, రమేష్ తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నందు అండర్ -17 విభాగంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగిన హాకీ పోటీలలో అనంతపురం జిల్లా జట్టు తరఫున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో అధికారులు రాష్ట్రం తరఫున ఆడేందుకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 22 నుంచి హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

పెద్దవడుగూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతోందని తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపైన అక్రమకేసులు బనాయించి నానా ఇబ్బంది పెట్టిందన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు పోకుండా అభివృద్ధి వైపు దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ చిరంజీవి, సీనియర్ నాయకుడు గంగరాజుయాదవ్ పాల్గొన్నారు.

పనివేళల పెంపును ఉపసంహరించుకోవాలి

తాడిపత్రి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పనివేళల పెంపును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జేసీ నాగిరెడ్డి కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడారు. ప్రభు త్వ పాఠశాలల పనివేళలను సాయంత్రం 5గంటల వరకు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనివల్ల ఆటోలు, కాలినడకన వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో పాఠశాల సమయం పెంపు విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు డేనియల్, నరసింహులు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, కల్వర్టుకు మరమ్మతులు

బొమ్మనహాళ్,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కళ్లదేవనహళ్లి, బండూరు రోడ్డు, కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన విషయం తెలిసిందే. దీంతో దర్గాహోన్నూరు, గోవిందవాడ, వన్నళ్లి, బొల్లనగుడ్డం, కల్లుహోళ్ల తదితర గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. వీటిని గమనించిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చొరవ చూపి రూ. 40 లక్షల వ్యయంతో రోడ్డు, కల్వర్టు మరమ్మతులు చేయించారు.

బ్రిడ్జి పరిమాణం పెంచాలి

- హైవే పనులను అడ్డుకున్న గ్రామస్థులు

డీ.హీరేహాళ్, నవంబరు 18: మండల కేంద్రంలో నేషనల్ హైవేకి సంబంధించిన బ్రిడ్జి పరిమాణాన్ని పెద్దదిగా చేసి నిర్మించాలంటూ సోమవారం స్థానికులు నేషనల్ హైవే పనులను అడ్డుకున్నారు. బళ్లారి నుంచి మండల కేంద్రం మీదుగా బెంగుళూరుకు నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి మండల కేంద్రంలో ఇరువైపులా వాహనాల రాకపోకల కోసం బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు. కాగా ఇక్కడ ప్రతి రోజూ వందలాది భారీ వాహనాల రాకపోకలు ఉంటాయని, అలాంటిది మండల కేంద్రంలో 35 అడుగుల పరిమాణంలో చిన్న బ్రిడ్జి నిర్మిస్తే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. కావున ఆ బ్రిడ్జిని కనీసం 60 అడుగులకు పెంచి నిర్మాణం చేపట్టాలని కోరుతూ హైవే పనులను అడ్డుకున్నారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకున్నారు. సమస్యను రాతపూర్వకంగా అధికారులకు రాసి ఇవ్వాలని సూచించారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి అధికారుల నుంచి స్పష్టత వచ్చేవరకు పనులు నిలుపుదల చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

వైభవంగా కడ్లే గౌరమ్మ రథోత్సవం



అమ్మవారి రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం



రథం ముందు హారతులతో మహిళలు

విడపనకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కడ్లే గౌరమ్మ పూల రథోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక బసవేశ్వర స్వామి ఆలయంలో కొలువు దీరిన కడ్లేగౌరమ్మ అమ్మవారికి గ్రామస్థులు గత నాలుగు రోజులుగా విశేషపూజలు చేశారు. చివరిరోజైన సోమవారం నిమజ్జనంతో వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా తెల్లవారు జామున అమ్మవారి విగ్రహాన్ని పూల రథంలో కొలువుదీర్చి స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న గౌరమ్మ బావి వరకూ ఊరేగింపు జరిపారు. ఆడపడుచులు మంగళహారతులతో రథం ముందు కదిలారు. కళాకారులు నంది కోళ్లు, చెక్క భజనలు, కోలాటాలతో సందడి చేశారు. విడపనకల్లు, మాళాపురం, వేల్పుమడుగు, ఆర్ కొట్టాల, వీ కొత్తకోట గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్థానిక గౌరమ్మ బావిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేయటంతో వేడుకలు ముగిశాయి.

దర్గాహొన్నూరు ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో దర్గా


బొమ్మనహాళ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన సయ్యద్ సర్మస్ హుస్సేన్ చిష్తీ ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హిందూ, ముస్లింల సమైక్యతకు ప్రతీక అయిన ఈ ఉరుసు ఉత్సవాలను వారంరోజుల పాటు నిర్వహించనున్నారు. సోమవారం గంధం నిర్వహించి, దర్గాలోని స్వామివారి సమాధిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పీఠాధిపతులు జగీద్దార్ సయ్యద్‌షా, సయ్యద్‌షా కమల్‌బాద్‌షా హుస్సేన్ చిష్తీ, జగీద్దార్ సయ్యద్‌షా రహంతుల్లా బాద్‌షా హుస్సేన్ చిష్తీల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. ఉరుసు ఉత్సవాల సందర్భంగా కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు దర్గాను సందర్శించారు. అలాగే అక్కడి పరిసరాల ప్రాంతాలను, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత మాట్లాడుతూ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్ఐ నబీరసూల్‌ను ఆదేశించారు. దర్గా కమిటీ సభ్యులు డీఎస్పీని, ఎస్ఐని సన్మానించారు.

● దర్గా హొన్నూరు ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో పెద్ద సంఖ్యలో భక్తులు రానున్నారని, ఇందుకు బళ్లారి నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని అక్కడి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డిని దర్గా కమిటీ సభ్యులు కోరారు. వారు బళ్లారికి వెళ్లి ఎమ్మెల్యేను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. బళ్లా రి నుంచి రూపనగుడి, బొమ్మనహాళ్ మీదుగా దర్గా హొన్నూరుకు బస్సులు నడపాలని విన్నవించారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

గుమ్మఘట్ట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామంలో సోమవారం రైతులకు రబీలో సాగు చేసుకునేందుకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మానాయక్, గుమ్మఘట్ట వ్యవసాయ అధికారి నిర్మల్‌కుమార్, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కాలువ సన్నన్న, సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొని రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ



దోనిముక్కల పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇంటిస్థలాలను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాము రాయల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దోనిముక్కల గ్రామ సచివాలయం వద్ద సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారం లో చంద్రబాబు కూటమి అధికారంలోకి వస్తే గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో 2సెంట్లు ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సుమలతకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయకార్యదర్శి రామాంజనేయులుయాదవ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు ఉమర్‌బాషా, గురుస్వామి, దండుగోవిందు, నాగరాజు, వెంకట్‌నాయక్, వంశీకృష్ణ, మల్లయ్య, గాజులప్రసాద్, రమేష్,పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని లచ్చానుపల్లిరోడ్డులోని సచివాలయం వద్ద సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం సచివాలయ అడ్మిన్ నవీన్‌కు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి రామదాసు, సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు రాజు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని రెండో సచివాలయం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం సచివాలయ సిబ్బందిని వినతిపత్రం ఇచ్చారు. నాయకులు గౌస్‌పీర్, సర్మాస్, బషీర్, హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలకేంద్రంలోని సచివాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిరసన చేపట్టి వీఆర్‌ఓ ఎర్రమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా నాయకుడు కేశవ రెడ్డి, నాయకులు పార్వతి, పెరుగు సంగప్ప, నారాయణమ్మ, రమణ, రమణప్ప, మలరాయుడు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలోని సచివాలయాల వద్ద సీపీఐ నాయకులు ఆందోళనలు చేపట్టి అక్కడి సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. నాయకులు రఘువీరా, శివలింగప్ప, రవి, మంజునాథ, రాజ్‌కుమార్, తిప్పేస్వామి, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ పంచాయతీలోని సచివాలయం వద్ద సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆందోళన చేసి అక్కడి సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని కిష్టిపాడు సచివాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, మండల కార్యద ర్శి వెంకటరాముడుయాదవ్, మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, నియోజకవర్గ అధ్యక్షులు ఆదినారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని పలు సచివాలయాల వద్ద సీపీఐ నాయకులు నిరసనలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ నాయకులు పెద్దయ్య, పెద్దిరాజు, పెద్దన్న, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

బెళుగుప్ప, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనంపల్లి, దుద్దేకుంట గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ డీఈ రసూల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి పల్లె పండుగ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2.60 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇన్‌చార్జి జేఈ పరశురామ్, సచివాలయం ఇంజనీర్ సతీష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డు చదును

బ్రహ్మసముద్రం: మండలకేంద్రంలోని తిప్పయ్యదొడ్డిలో మట్టిరోడ్డు అధ్వానంగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. దీంతో ఎంపీటీసీ మాజీ సభ్యుడు తిప్పేస్వామి రోడ్డుకు సుమారు 50 ట్రిప్పులు ఎర్రమట్టిని తోలించి చదును చేయించారు. అలాగే రోడ్డు పక్కల కంపచెట్లను తొలగింపజేశారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

ఉరవకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఈశ్వరయ్య సోమవారం కోరారు. మండలంలో ఉరవకొండలో రెండు, ఆమిద్యాల, రాయంపల్లిలో ఒక్కొక్కటి చొప్పున ఆధార్‌కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉరవకొండలో మహేశ్వరి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్‌కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్‌లో ఏదేని మార్పు లు, చేర్పులు ఉన్నవారు వినియోగించుకోవాలని సూచించారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో మంగళవారం నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ రఘురామారావు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.